క్లుప్తంగా

మురుగు డ్రెయిన్ల ప్రక్షాళన


వాకపల్లిలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

గణపవరం: మండలం వాకపల్లి గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. కొంతకాలంగా గ్రామంలోని సీసీ రోడ్ల ప్రక్కన మురుగు కాల్వలు పూడికతో నిండిపోవడంతో మురుగు నీరు రోడ్లమీదికి చేరడంతో అపారిశుద్ధ్యం నెలకొంది. వర్షం వస్తే పరిస్థితి మరీ దుర్భరంగా తయారవుతుంది. దీనితో సర్పంచ్ ఆదిమూలం శ్రీనివాస్ పర్యవేక్షణలో డ్రెయిన్లలో పూడిక తొలగించి, మురుగునీరు సక్రమంగా పారేలా చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మంత్రి కొలుసు పార్థసారథికి శుభాకాంక్షలు


మంత్రి పార్థసారథిని కలిసిన ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథిని గురువారం ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కలిశారు. ఏలూరు క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ధర్మరాజుతోపాటు ఎంపీ పుట్టామహేష్ కుమార్ యాదవ్, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన వృక్షం


జానంపేటలో రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షం

పెదవేగి : భారీ ఈదురుగాలులకు ఓ వృక్షం నేలకొరిగింది. పెదవేగి మండలం జానంపేట వద్ద గురువారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో వృక్షం నేలకొరిగింది. దీంతో ఏలూరు – చింతలపూడి రహదారిపై వాహనాలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు, స్థానికుల యుద్ధప్రాతిపదికన పడిన చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

ఎమ్మెల్యే ధర్మరాజును కలుస్తున్న అభిమానులు


ఎమ్మెల్యే ధర్మరాజును కలిసిన అధికారులు

ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా విజయం సాధించిన పత్సమట్ల ధర్మరాజును టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, పలువురు అధికార్లు కలిసి అభినందనలు తెలిపారు. గురువారం తాడేపల్లిగూడెం ఉప విద్యాశాఖాధికారి ఎన్.రవీంద్రభారతి ఆధ్వర్యంలో ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం భీమడోలు ఎంఈవోలు కె. శ్రీనివాసరావు, కె.రాంబాబు, పి.శేషు, బాస్కర్‌కుమార్‌లతో ఉంగుటూరు, భీమడోలు మండలాల ఉపాధ్యాయులతో వెళ్లి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును కలిసి అభినందనలు తెలిపారు. అలాగే పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపారు.

లారీని ఢీకొని వ్యక్తి మృతి


లక్ష్మణరావు మృతదేహం

ఉంగుటూరు: భీమడోలు మండలం కురెళ్ల గూడెం గ్రామానికి చెందిన దుగ్గిరాల లక్ష్మణరావు (63) ద్విచక్ర వాహనంపై నిడదవోలు వెళ్తుండగా ఉంగుటూరు వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొట్టారు. దీంతో ఆయన తలకు తీవ్రగాయం కాగా తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణరావు మృతిచెందారు.

చిన్నారుల వ్యక్తిగత వివరాలపై ఆరా

ఏలూరు (టూటౌన్): స్థానిక విద్యానగర్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న శిశు గృహాన్ని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జంగం రాజేంద్ర ప్రసాద్ చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూషన్స్ నోడల్ అధికారి జె.దుర్గాప్రసాద్‌తో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం శిశుగృహంలో ఆశ్రయం పొందుతున్న ఎనిమిది మంది చిన్నారుల వ్యక్తిగత వివరాలను అడిగి తెలుసుకున్నారు. దత్తతకు అర్హులైన బాలలకు సంబంధించి లీగల్లీ ఫ్రీఫర్ అడాప్షన్ ఆర్డర్ వెంటనే ఇవ్వాలని సీడబ్ల్యూసీ సభ్యులను ఆదేశించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్ సూర్యచక్రవేణి, శిశు గృహం మేనేజర్ భార్గవి పాల్గొన్నారు.

విద్యార్థులతో సందడిగా స్కూళ్లు


పెదవేగి విజయరాయిలో హైస్కూల్‌కు పరుగుతీస్తున్న విద్యార్థులు


పెదవేగి : 02. కొప్పాక హైస్కూల్‌కు వెళుతున్న విద్యార్థులు

- మోగిన బడి గంటలు
- ఉత్సాహంగా విద్యార్థులు

పెదవేగి : వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పెదవేగి మండలంలో అన్ని గ్రామాల్లో పాఠశాలలకు విద్యార్థులు ఉత్సాహంగా తరలివచ్చారు. విద్యార్థులకు ఎంఈఓ-2 అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ 70 శాతం పూర్తి చేశారు. మండలంలో 7078 విద్యార్థులు ఉండగా, మిగిలిన 30 శాతం విద్యార్థులకు కిట్లను పంపిణీ చేయాల్సి ఉంది. ఈనెలఖరు వరకు అడ్మిషన్‌లు నిర్వహిస్తారు. పాఠశాల మొదటి రోజు ఉపాధ్యాయులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేరీ లైఫ్ అనే కార్యక్రమాన్ని సేవ్ వాటర్, క్లీన్, హైజీన్, అంశాలను విద్యార్థులకు వివరించారు.

ఉత్సాహంగా ఉల్లాసంగా విద్యా ప్రవేశిక

భీమడోలు: పాఠశాలల పునః ప్రారంభమైన గురువారం ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు రోజంతా ఉల్లాసంగా గడిపారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని ప్రాథమిక పాఠశాల్లోని ప్రతి పాఠశాలలో విద్యా ప్రవేశిక కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. దీనితో పాఠశాలల్లో కొత్తగా చేరే విద్యార్థులకు బడి అంటే భయం పోగొట్టేలా విద్యాశాఖ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రధానంగా బంతి ఆటతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనితో చిన్నారులంతా ఆట పాటలతో మమ్మేకమయ్యారు. విద్యార్థుల్లో జ్ఞానేంద్రియాల అభివృద్ధికి దోహదపడే అంశాలను ఉపాధ్యాయులు దగ్గరుండి చిన్నారులతో చేయించారు. చూసి చెప్పడం, విని చెప్పడం, క్రమంలో ఉంచడం, వాసన చూపి చెప్పడం, విని గ్రహించి చెప్పడం, స్పర్శ గ్రహించి చెప్పడం, ఆకారాలు, బంతి ఆటతో పరిచయం, కింద పడకుండా పట్టుకోవడం, చేతి ముద్ర, గురి చూసి విసరడం, ఛార్ట్‌పై చేతి ఆకారం గీయడం తదితర అంశాలపై చిన్నారులతో ఉపాధ్యాయులు మమ్మేకయ్యారు. దీనితో చిన్నారులంతా ఉల్లాసంగా గడిపి బడి వచ్చేందుకు ఆసక్తిని కనుబర్చారు. గుండుగొలను నెం.2 పాఠశాల హెచ్ఎం పాశం పాండురంగారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కొత్తగా చేరిన విద్యార్థులతో వినూత్న తరహా కార్యక్రమాన్ని చేపట్టారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



జగనన్న విద్యాకానుక నమూనా

దెందులూరు: వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాల విద్యార్థుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రవేశపెట్టిన జగనన్న విద్యా కానుకను ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం స్టూడెంట్ కిట్‌గా పేరు మార్చింది. పాఠశాలలు గురువారం పునఃప్రారంభం కావడంతో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. గత ప్రభుత్వం జగనన్న విద్యా కానుకగా స్కూల్ బ్యాగ్, యూనిఫామ్, షూ, సాక్స్, బెల్ట్, టెస్ట్‌బుక్స్, నోట్‌బుక్స్ ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు అందించేంది. టీడీపీ ప్రభుత్వం పాఠశాల పునఃప్రారంభోత్సవం రోజున స్టూడెంట్ కిట్‌గా పేరు మార్చి, టెస్ట్‌బుక్స్, నోట్‌పుస్తకాలు, బెల్టు మాత్రమే విద్యార్థులకు అందించారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. యూనిఫామ్, షూ, సాక్స్, బ్యాగు ఇవ్వ లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీటిని త్వర లో విద్యార్థులకు అందిస్తామని ఉన్నతాధికారులు, మండలాధికారులకు చెప్పినట్లు తెలిసింది.


స్టూడెంట్స్ కిట్

పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు

దెందులూరు: అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు చేరాయి. కొవ్వలి ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్ నుంచి మండలంలో అన్ని పాఠశాలలకు వాహనం ద్వారా పుస్తకాలను సరఫరా చేశారు. పుస్తకాల కేటాయింపు, సరఫరా కార్యక్రమాన్ని ఎంఈఓ-2 కె.అన్నమ్మ పర్యవేక్షించారు.


గుండుగొలనులో కొత్తగా చేరిన విద్యార్థి బంతి ఆట పరిచయంలో భాగంగా బంతిని విసురుతున్న దృశ్యం


దెందులూరు: పాఠ్యపుస్తకాల సరఫరాను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ అన్నమ్మ

సర్పంచ్ దంపతులపై కేసు నమోదు

భీమడోలు: స్థానిక గ్రామ సర్పంచ్ దంపతులపై గురువారం రాత్రి భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమడోలు పంచాయతీ పరిధిలోని అర్జావారిగూడెం సర్పంచ్ దంపతులు పాము సునీతా మాన్‌సింగ్‌కు అదే ఇంట్లో నివాసం ఉండే సునీత సోదరుడు అశ్వినీకుమార్ కుటుంబ సభ్యులకు మధ్య ఇంటి విషయంలో తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 12న నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం నేపథ్యంలో సంఘీభావం తెలుపుతూ అశ్వినీకుమార్ భార్య ఇంటి గుమ్మానికి ఎన్‌డీఏ కూటమి జెండాను కట్టగా దానిపై సర్పంచ్ దంపతులు ఆగ్రహించి అశ్వినీకుమార్ దంపతులను కొట్టి గాయపరిచారు. దీంతో అశ్వినీకుమార్ భీమడోలు సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. సర్పంచ్ దంపతులు కూటమి జెండాను అవమానపర్చారని అశ్వినీ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే ఘటనపై ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ఎన్‌డీఏ కూటమి జెండాను అవమానించిన సర్పంచ్ దంపతులపై తగు చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాపై ఉద్దేశ్యపూర్వకంగానే కేసు పెట్టారు: సర్పంచ్ దంపతుల వివరణ

వాస్తవంగా ఇది మా కుటుంబ వివాదం. చాలా కాలంగా మాకు, మా సొంత బావమరిది అశ్వినీ కుమార్ కుటుంబ సభ్యులకు తగాదాలు ఉన్నాయి. ఈనెల 12న బుధవారం అశ్వినీకుమార్ దంపతులు కూటమి కార్యకర్తల ప్రోద్బలంతో మా ఇంటిపై కూటమి జెండాను పెట్టించారు. దీంతో జెండాను తీయాలని కోరడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. అశ్వినీకుమార్ కుటుంబ సభ్యులు మాపై దాడి చేశారు. దీంతో మేము, మా పిల్లలం భయాభ్రాంతులకు గురయ్యాం. వారి కన్నా ముందుగానే భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశాం. మాపై కూటమి కార్యకర్తలు, నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడడం దారుణమని సర్పంచ్ దంపతులు పాము సునీతా, మాన్‌సింగ్‌లు గురువారం రాత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు

కామవరపుకోట: ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తాతపూడి ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ఏపీఎస్ఆర్టీసీ దివ్యాంగులకు ఇచ్చే బస్సు పాసులను గురువారం స్థానిక రోమన్ క్యాథలిక్ మిషన్ ఆవరణలో ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఫాదర్ ఇమ్మానియేలు మాట్లాడుతూ మా సంస్థ ద్వారా ఇప్పటికీ 620 మందికి ఉచిత బస్సు పాస్‌లు అందజేశామన్నారు. అర్హతలను బట్టి ఏలూరు డిజేబుల్ వెల్ఫేర్ ఆఫీస్ ద్వారా దివ్యాంగులను పరీక్షించి అవసరమైన వారికి వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, కాలిపర్స్, హియరింగ్ మిషన్స్, లాప్టాప్, స్మార్ట్ ఫోన్స్, లోన్స్, హ్యాండ్ స్టిక్స్, వాకర్స్, ట్రైన్ పాస్‌లు అందించి, పోలియో ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామని ఆయన తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 63036 10275, 91336 21253 సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఫాదర్‌లు అమ్మన్న రాజా, పీటర్ ప్రసాద్, ఎన్ కృపానందం, కాసు కుమారి, ఝాన్సీ రాణి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎఫ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి


సరిపల్లె సీపీఎఫ్ కంపెనీ వద్ద నిరాహార దీక్షలు చేస్తున్న ఉద్యోగులు

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీని కంపెనీ యాజమాన్యం అన్యాయంగా మూసి వేసి ఉద్యోగులకు తీరని అన్యాయం చేసిందని, కంపెనీ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ కంపెనీ ఉద్యోగులు చేస్తున్న నిరాహార దీక్షలు గురువారం ఏడోరోజుకు చేరాయి. కంపెనీలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. కంపెనీ గేటు వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఉద్యోగాలలోకి తీసుకున్న సమయంలో ఉద్యోగభద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని మరిచిపోయి ఉద్యోగులకు అన్యాయం చేశారని విమర్శించారు. సీపీఎఫ్ రొయ్యలు, చేపలమేతల తయారీ కంపెనీకి దేశంలో అనేక చోట్ల యూనిట్లు ఉన్నాయని, వీటిలో సరిపల్లె యూనిట్ లాభాలలో ఉన్నా ఎందుకు మూసి వేశారో అర్థంకావడం లేదని ఉద్యోగులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని, పరిహారం చెల్లించాలని, కంపెనీని తెరవాలని వారు నినాదాలు చేశారు. ఈ నిరహార దీక్షలో పలువురు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా సర్కారు బడుల ప్రచారం


ఉప్పాకపాడులో ఉపాధ్యాయులు గృహ సందర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఉపాధ్యాయులు వినూత్న ప్రచార కార్యక్రమాలతో ప్రైవేటు పాఠశాలలకు సవాల్ విసురుతున్నారు. నిన్నటి వరకూ ఎన్నికల ప్రచారంతో హోరెత్తిన గ్రామాలు ఇప్పుడు పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. తమ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, బోధన, తదితర అంశాలను వివరిస్తూ చిన్నారులను ఆకర్షించేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటి వరకూ ప్రైవేటు పాఠశాలలకే పరిమితమైన ఈ తరహా ప్రచారంలోకి ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలూ వచ్చి చేరడంతో మీ పిల్లలను మా బడికే పంపండంటూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఒకరికొకరు పోటీపడుతూ ప్రచారాన్ని సాగిస్తున్నాయి. ఉప్పాకపాడులో ఉపాధ్యాయులు గృహ సందర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. హెచ్ఎం సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని, విద్యార్థులను హైస్కూల్‌లో చేర్పించాలని తల్లితండ్రులను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అల్లుశ్రీను, పి. శ్రీదేవిలు పాల్గొన్నారు.

మలేరియా జ్వరాలపై అవగాహన


కొవ్వలిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: మలేరియా జ్వరాల వ్యాప్తి, నిర్మూలనపై ప్రజలకు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అవగాహన కల్పించారు. గురువారం కొవ్వలిలో పోతునూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ హరిబాబు, పద్మావతి ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ కీటకాలన్నింటిలో దోమల అత్యంత ప్రమాదకరమన్నారు. వీటి వల్ల మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలుతాయని, దోమల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని సూచించారు. మలేరియా, డెంగీ దోమలు ఇళ్ల వద్ద మంచినీరు నిల్వ ఉండే తొట్టెలు, డ్రమ్ములు, వాడేసిన టైర్లు, కాళీ కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లు, పూలకుండీలు, ఫ్లవర్‌వాజ్‌ల్లో పెరుగుతాయని చెప్పారు. వారానికి ఒకసారి పరిశుభ్రత పాటించడం ద్వారా దోమలను అరికట్టవచ్చని సూచించారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయవద్దని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 63 రకాల రక్త మూత్ర పరీక్షలు నిర్వహిస్తారని, ప్రతి ఒక్కరూ ఈ సేవలను వినియోగించుకోవాలని అన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ ప్రవల్లిక, నాగలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, సురేష్, ఏఎన్ఎం సరిత, ఆశ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వేగంగా మిలినియం చర్చి నిర్మాణం

దెందులూరు: స్థానిక గౌడవీధిలో సాల్వేషన్ ఆర్మీ మిలినియం చర్చి నిర్మాణ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ పనులను గురువారం స్థానిక కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య, సంఘ పెద్దలు, దాతలు పరిశీలించారు. చర్చి నిర్మాణానికి రెండు సెంట్ల స్థలాన్ని దివంగత రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పల్లె యోహాన్, చంద్రహాస్ దంపతులు ఇచ్చిన సంగతి విధితమే.

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్‌లు గురువారం ఒక ప్రకటనలో కోరారు. నూతన ప్రభుత్వం మెగా డీఎస్సీపై ప్రకటన చేస్తున్న నేపథ్యంలో ఏజెన్సీలో కూడా ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని వారు కోరారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులతో ఈ ప్రాంతంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కొయ్యలగూడెం: యర్రంపేట పంచాయతీ ఏడువాడలపాలెం గ్రామంలో గురువారం ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పొంగుటూరు సెక్టార్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


భీమడోలులో మొక్కలు నాటుతున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు, చిన్నారులు


కొవ్వలి హైస్కూల్లో పర్యావరణ దినోత్సవం

భీమడోలు: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థి దశ నుంచి భాగస్వాములు కావాలని భీమడోలు ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో గురువారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఇంచార్జి హెచ్ఎం ఆహ్మద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్‌లు పాల్గొని ప్రసంగించారు. ఎకో క్లబ్ యాక్టివిటీస్‌లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నాలన్నారు. పర్యావరణం పట్ల సామాజిక స్పృహను కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు నాటిన మొక్కలను దత్తత తీసుకుని వాటిని సంరక్షించాలన్నారు. నేటి సమాజంలో వాతావరణ కాలుష్యం పెరిగిపోతుందని, దీని వల్ల మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందన్నారు. వాతావరణ కాలుష్య మహమ్మారీని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తమ గృహాల వద్ద విరివిగా మొక్కలు నాటిని వాటిని సంరక్షించుకోవాలని, తల్లిదండ్రులను సైతం చైతన్యవంతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

దెందులూరు: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని ఎంఈఓ-2 కె.అన్నమ్మ అన్నారు. గురువారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జీఎస్ఎల్ఎస్‌వీ శర్మ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవ వారోత్సవాలను అన్నమ్మ ప్రారంభించారు. భూమి, నేల, చెట్టు, నీరు అంశాలపై విద్యార్థులకు సైన్సు ఉపాధ్యాయులు కరుణకుమారి, రాధాకృష్ణ, మజీద్‌ఖాన్‌లు అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. అనంతరం ఏకో క్లబ్ విద్యార్థులు పర్యావరణంపై గీసిన చిత్రాలను పాఠశాలలో ప్రదర్శించారు.

కల్లుగీత సొసైటీలకు బ్రాందీ షాపులు కేటాయించాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో కల్లుగీత సొసైటీలకు 40 శాతం బ్రాందీ షాపులు కేటాయించాలని ఏపీ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కష్టాల్లో ఉన్న కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించి, గీత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను తక్షణం ప్రక్షాళన చేయాలన్నారు. కల్లు గీత కార్మిక సొసైటీలకు పూర్తి జవసత్వాలు తీసుకొచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, గీత కార్పొరేషన్ పునరుద్ధరించి ప్రభుత్వానికి, గీత కార్మికులకు మధ్య వారధిగా పనిచేయాలని కోరారు. అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిఏటా బడ్జెట్లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5 వేల కోట్లు నిధులు కేటాయించి ఖర్చు చేయాలన్నారు. ప్రమాదంలో చనిపోయిన గీత కార్మిక కుటుంబాలకు నెల దాటకుండా రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలు నెలకొల్పి గీత కార్మికుల బిడ్డలకు ఉపాధి కల్పించాలన్నారు. కల్లు గీత కార్మికులను ప్రమాదం నుంచి కాపాడేందుకు ప్రభుత్వమే ఉచితంగా సేఫ్టీ మోకులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

బిషప్ జయరావు సేవలు అసామాన్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు కథోలిక పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు సేవలు అసామాన్యమని నిర్మలగిరి పుణ్యక్షేత్రం ప్రతినిధి, ఏలూరు మేత్రాసనం ప్రొక్యూరేటర్ ఫాదర్ రాజు అన్నారు. జయరావు బిషప్‌గా ప్రకటించి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం స్థానిక బిషప్ హౌస్‌లో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేకమాలతో సత్కరించారు.